

తీరనున్న రైతుల కష్టాలు
భక్త రామదాసు ప్రాజెక్టుకు సంబంధించి కాల్వల తవ్వకం అన్నిచోట్లా పూర్తవడంతో అదనపు ఆయకట్టుకు నీరు అందనుంది. 8లో



ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..
స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని జెడ్పీ సీఈఓ దీక్షారైనా వెల్లడించారు 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
31° / 17°
జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. సాయంత్రం తర్వాత మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

మట్టిలో కలిసినట్లే..



నర్సరీలో పక్కన పెట్టిన ఆయిల్‌పామ్ మొక్కలు

కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న ఆయిల్‌పామ్ మొక్కలు జన్యుపరమైన లోపాలతో ఎదుగూబొదుగు లేకుండా ఉండడంతో నాటడానికి పనికి రావని తేల్చారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు లక్షల మొక్కలు ఆఫ్ టైప్(పనికి రావు) అని గుర్తించడం ఆయిల్ ఫెడ్‌లో చర్చనీయాంశంగా మారింది. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని ఆయిల్‌ఫెడ్ నర్సరీకి 2023 జూలైలో రూ.1.80 కోట్లు వెచ్చించి కోస్టారికా దేశం నుంచి మూడు లక్షల మొక్కలు తెప్పించారు. అయితే, ఈ మొక్కలను ఇంకా రైతులకు పంపిణీ చేయకున్నా విడతల వారీగా పనికి రావని తేలుతున్న నేపథ్యాన గత మూడేళ్లలో జరిగిన మొక్కల లావాదేవీలపై ఆయిల్‌ఫెడ్ అధికారులు అంతర్గత విచారణ చేపడుతున్నారు. – సత్తుపల్లి

3లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు పనికిరావట..
- రేగళ్లపాడు నర్సరీలో పక్కన పెట్టేసిన అధికారులు
- ఆయిల్‌ఫెడ్‌కు రూ.2 కోట్ల మేర నష్టం
- విచారణ నివేదిక బయటపెడితే వెలుగుచూడనున్న నిజాలు

2022 నుంచి రేగళ్లపాడులో నర్సరీ..
మన రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుండగా రైతులకు సబ్సిడీపై మొక్కలు సరఫరా చేస్తారు. ఈమేరకు ఇండోనేషియా, మలేషియా, కోస్టారికా దేశాల నుంచి పామాయిల్ పిలక మొక్కలను దిగుమతి చేసుకుంటారు. పిలక మొక్కల కోసం ఆర్డర్ పెడితే కనీసం 18 నెలల తర్వాత సరఫరా చేస్తారు. కాగా, పెనుబల్లి మండలం బయన్నగూడెంలో ఉన్న ఆయిల్‌ఫెడ్ నర్సరీని 2022లో సత్తుపల్లి మండలం రేగళ్లపాడుకు మార్చారు. అప్పటి నుంచి మూడు విడతలుగా ఆయిల్‌పామ్ మొక్కలను తెప్పించగా మొదటి ఏడాది కోస్టారికా దేశం నుంచి వచ్చిన మూడు లక్షల మొక్కలను గతంలో రైతులకు అందించారు. ఇక రెండో విడత ఇండోనేషియా నుంచి ఆరు లక్షల మొక్కలు దిగుమతి చేసుకుని దఫాల వారీగా రైతులకు పంపిణీ చేస్తున్నారు.

గ్రేడింగ్ చేసే కొద్దీ...
మూడో దశలో మళ్లీ కోస్టారికా దేశం నుంచే మూడు లక్షల మొక్కలను 2023 జూలైలో దిగుమతి చేసుకున్నారు. అయితే, మొక్కలు ఆరు నెలల వరకు ఎదుగుదల లేకపోవడంతో పలు దఫాలుగా అధికారులు పరీక్షించారు. 2024 జూలైలో అప్పటి హార్టికల్చర్ అధికారి భారతి ఏడాది వయస్సు కలిగిన మొక్కలను పరీక్షించి ఎదుగుదల లేదని తేల్చారు. దీంతో ఓసారి గ్రేడింగ్ అనంతరం 80 వేల మొక్కలు పూర్తిగా పనికిరావని ధ్వంసం చేశారు. ఆపై 2.20 లక్షల మొక్కల్లో మళ్లీ గ్రేడింగ్ చేసి 1.50 లక్షల మొక్కలను విడిగా పెంచాలని నిర్ణయించారు. మిగిలిన 70వేల మొక్కల్లో 20వేల మొక్కలు కూడా పనికిరానివని పక్కనపెట్టగా, 50వేల మొక్కలు కొన్నాళ్లు వేచి చూసినా కొన్ని ఎదగగా, మరికొన్ని ఎదగలేదు. అయితే, విడిగా పెంచుతున్న 1.50 లక్షల మొక్కలు ఒకే రీతిలో ఎదగకపోవడంతో గతేడాది డిసెంబర్‌లో పరిశీలించిన ప్రభుత్వ ఆయిల్ ఫెడ్ సలహాదారుడు రాజశేఖర్‌రెడ్డి అవి కూడా ఆఫ్ టైప్ (పనికి రావు) అని తేల్చినట్లు సమాచారం. ఇలా మొత్తం మీద మూడు లక్షల మొక్కలు పనికి రానివని నిర్ధారించటంతో ఆయిల్‌ఫెడ్ సంస్థకు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఆయిల్‌ఫెడ్‌లో కోల్డ్‌వార్
ఆయిల్‌ఫెడ్ అధికారుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధంతో ఇన్నాళ్లు కప్పిపుచ్చిన లోపాలు ఒక్కటొక్కటిగా బయట పడుతున్నట్లు సమాచారం. అధికారులు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ రచ్చకెక్కుతున్నట్లు తెలిసింది. ఆయిల్‌ఫెడ్ నర్సరీలో ఆధిపత్యం కోసం ఓ అధికారిపై చర్యలు తీసుకుని ఆయన సీనియారిటీ తగ్గించడం ద్వారా మరో అధికారికి బాధ్యతలు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చర్చ జరుగుతోంది. కాగా, రేగళ్లపాడు ఆయిల్‌ఫెడ్ నర్సరీకి ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు విచారణాధికారిగా వచ్చిన ప్రవీణ్‌రెడ్డి ఇంకా నివేదిక సమర్పించలేదని తెలిసింది. కాగా, ఈ విషయమై ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, విచారణాధికారి ప్రవీణ్‌రెడ్డి వివరణ కోసం పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు.

రికవరీ కష్టమే
ఆయిల్‌ఫెడ్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు నష్టపోయిన మొక్కలకు సంబంధించి రికవరీ చేసిన దాఖలాలు లేవని సమాచారం. కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న మూడు లక్షల పిలక మొక్కలు ఆఫ్‌టైప్‌గా ఉన్నాయని ప్రభుత్వం ఆ దేశానికి నివేదిక ఇస్తే రీప్లేస్‌మెంట్ లేదా పరిహారం చెల్లింపునకు అంగీకరించే అవకాశముంది. అయితే, ఆచరణలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి రికవరీ జరిగిన దాఖలాలు లేవని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

ఎరుపెక్కిన ఖమ్మం మార్కెట్



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

- 30వేల మిర్చి బస్తాలతో కళకళ
- ధరలో మాత్రం కానరాని పురోగతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం మిర్చి బస్తాలతో కళకళలాడింది. మార్కెట్ కమిటీ లెక్కల ప్రకారం 30వేల బస్తాల మిర్చిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. ఇందులో ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 27,338 బస్తాలతో పాటుఏసీ మిర్చి 1,550 బస్తాలే కాక తాలు మిర్చి ఉంది. ప్రస్తుత సీజన్‌లో ఈ సరుకే అత్యధికమని అధికారులు వెల్లడించారు. ఈనెల రెండో వారంలో 10 వేల బస్తాలు, సంక్రాంతి తర్వాత 16వ తేదీన 15వేల బస్తాల మిర్చిని తీసుకురాగా సోమవారం అంతకు రెట్టింపు సరుకు వచ్చింది. ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్, వరంగల్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నుంచే కాక ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు కూడా ఇక్కడకు తేజా రకం మిర్చి తీసుకొచ్చారు.

విదేశీ ఎగుమతులు లేక...
మిర్చి విక్రయాలు పెరుగుతున్నా ధరలో ఎలాంటి పురోగతి కానరావడం లేదు. గత నవంబర్ నుంచి విదేశీ ఎగుమతులు పడిపోవడం, చైనా నుంచి ఆర్డర్లు లేకపోవడంతో గత ఏడాది సీజన్‌లో క్వింటాకు రూ.22వేలకు పైగా పలికిన ధర ఈ ఏడాది సీజన్ ప్రారంభం నాటికి గణనీయంగా పడిపోయింది. ఖమ్మం మార్కెట్‌లో తేజా రకం మిర్చికి సోమవారం గరిష్ఠ ధర రూ.15,300 నమోదు కాగా ఏసీ మిర్చి ధర రూ.14వేలుగా నమోదైంది. కాగా, 16వ తేదీన గరిష్ఠ ధర రూ.14వేలు ఉండగా సోమవారం 15,300గా నమోదైనా ఈ ధర కొద్దిపాటి సరుకుకే దక్కగా, ఎక్కువ సరుకును రూ.14వేలతోనే కొనుగోలు చేశారు. తేజా రకం మిర్చిని విదేశీ ఎగుమతుల కోసం ఎక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే, ఎగుమతులు మందగించడంతో దేశీయ మార్కెట్ ఆధారంగానే ధర నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ కొనుగోలు చేసే మిర్చిని రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

గత కొద్దినెలలుగా ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర (గరిష్టంగా రూ.ల్లో)

తేదీ	ధర
2024 అక్టోబర్ 3	20,000
నవంబర్ 4	18,300
నవంబర్ 26	16,500
డిసెంబర్ 18	16,200
డిసెంబర్ 31	15,511
ఈనెల 2	14,900
జనవరి 6	15,800
జనవరి 16	14,000
జనవరి 20	15,300

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

జిల్లాలో ఐదు కేంద్రాలు, 6వేల మంది విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు ఈనెల 22వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయగా సుమారు 6వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఈనెల 22, 23, 24, 28, 29, 30వ తేదీల్లో రెండేసి సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. మొదటి సెషన్ ఉదయం 9నుంచి 12గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు నిర్వహించనుండగా విద్యార్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, రేషన్ కార్డుల్లో ఒకటి లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పెన్ను, అడ్మిట్‌కార్డు, వాటర్ బాటిల్, బీఆర్ పరీక్షకైతే పెన్సిల్, స్కేల్, రబ్బర్, జామెంట్రీ బాక్స్ వెంట తీసుకొచ్చుకోవాల్సి ఉంటుంది.

సమయపాలన తప్పనిసరి



జేఈఈ మెయిన్స్, బీఆర్క్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులు సాధారణ దుస్తులు ధరించడంతో పాటు షూ కాకుండా చెప్పులతో హాజరుకావాలి. హాల్‌టికెట్‌లో సూచించినట్లు సమయపాలన, ఇతర నిబంధనలు పాటించాలి. పరీక్ష అనంతరం రఫ్ బుక్‌లెట్‌ను డ్రాప్‌బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది.
– పార్వతీరెడ్డి, పరీక్షల జిల్లా కోఆర్డినేటర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంరూరల్/ఖమ్మంఅర్బన్: ప్రభుత్వం ఈనెల 26న నుంచి అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఈ విషయంలో ఎవరూ ఆందోళనకు గురికావొద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు, ఖమ్మం 11వ డివిజన్‌లోని కవిరాజ్‌నగర్‌లో సోమవారం పర్యటించిన ఆయన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉద్యోగులు చేస్తున్న సర్వేను తనిఖీ చేశారు. తప్పిదాలు దొర్లకుండా క్షేత్రస్థాయి సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. రైతు భరోసాలో అనర్హుల పేర్లు తొలగించేందుకు మైనింగ్ లీజు, వెంచర్లు, ఇటుకబట్టీలు ఏర్పాటైన భూములను పరిశీలించాలన్నారు. కాగా, తొలి విడతగా స్థలం ఉన్న వారికి, ఆ తర్వాత మిగతా వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నందున పేదలు అపోహలకు గురికావొద్దని సూచించారు. అంతేకాక పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం నుంచి మొదలయ్యే గ్రామసభల్లో లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలు ప్రదర్శించనున్నందున అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే)లో ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ

రామదాసు మండపంలో రాపత్తు సేవ

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామికి సోమవారం రామదాసు మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీ సేవగా అంబసత్రానికి తీసుకెళ్లారు. అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి నివేదన, హారతి సమర్పించారు. స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ దంపతులు రాపత్తు సేవలో పాల్గొన్నారు.

3.50లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ద్వారా ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు రూ.99 కోట్ల విలువైన 3.50 లక్షల క్వింటళ్ల ధాన్యం కొనుగోలు చేశామని చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు వెల్లడించారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలోని 29కేంద్రాల ద్వారా 2.56 లక్షల క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలోని 11కేంద్రాల ద్వారా 94వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా రైతుల వద్ద ధాన్యం ఉంటే డీసీఎంఎస్ కేంద్రాల్లో త్వరగా విక్రయించుకోవాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, మారుతి ఎట్టయ్య, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

రెండో రోజుకు చేరిన పోలీసుల క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు ఉపశమనం కలిగించేలా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు సోమవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పురుషులు, మహిళలకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించగా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ పోటీలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించడమే కాక బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ సత్తా చాటారు. కాగా, రెండో రోజు పురుషుల షాట్‌పుట్‌లో ఎస్.కే.మజీద్(కల్లూరు), ఎస్.కే.ఉద్దండు(ఏఆర్, ఖమ్మం), ఎ.వెంకటేశ్వర్లు(వైరా), 800 మీటర్ల పరుగులో వినోద్, గణేష్(ఏఆర్, ఖమ్మం), కేశవ్(కూసుమంచి), డిస్కస్ త్రోలో ఎస్.కే.మజీద్(కల్లూరు), నాగరాజు, మహేష్(ఏఆర్, ఖమ్మం), మహిళల షాట్‌పుట్‌లో ఎం.మౌనిక(ఆర్ఎస్సై, ఖమ్మం), వి.శ్రావణి(ఏఆర్, ఖమ్మం), ఎన్.స్వప్న (హోంగార్డ్) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు. అలాగే, డిస్కస్ త్రోలో బి.లక్ష్మీకుమారి(వైరా), ఎం.మౌనిక, ఆర్.సునీత(ఏఆర్, ఖమ్మం, బి.మాధవి(వైరా), 100 మీటర్ల పరుగులో ఎల్.భవాని, ఉషారాణి, హరిత(ఖమ్మం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కాగా, మంగళవారం పోటీలు ముగియనుండగా విజేతలకు బహుమతులు అందజేస్తారు.



పరుగు పందెంలో మహిళలు



బ్యాటింగ్ చేస్తున్న సీపీ సునీల్‌దత్

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

కామేపల్లి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. మండలంలోని ఊట్కూర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన కళాజాత బృందం సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాతాశిశు మరణాల కట్టడి, టీబీ, కుష్టు, కేన్సర్ వాధ్యుల నియంత్రణతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కళారూపాల ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ప్రసవాలు, ఇతర చికిత్సలకు ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఐఓ డాక్టర్ చందు నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఉద్యోగులు సాంబశివరెడ్డి, పద్మ, సుధారాణి, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, తిరుమలరావు, రమణ, ఉష పాల్గొన్నారు.

టెట్‌కు 930 మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు(టెట్) జిల్లాలోని ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యాన సోమవారం నాటి పరీక్షకు 2,159మంది అభ్యర్థుల్లో గాను 1,229 మంది హాజరు కాగా... 930మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా సాగేలా పర్యవేక్షిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

ఏకలవ్య స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కారేపల్లి: మండల కేంద్రం(సింగరేణి)లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలోని 23 ఏకలవ్య పాఠశాలల్లో 1,380 సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించి, మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఐదో తరగతి పూర్తిచేసిన గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులు లేని, దివ్యాంగులైన తల్లిదండ్రులు ఉన్న వారిలో ఈ ఏడాది మార్చి నాటికి 10నుంచి 13ఏళ్ల వయస్సు నిండనున్న వారు అర్హులని వెల్లడించారు. ఈమేరకు ఫిబ్రవరి 16లోగా దరఖాస్తు చేసుకుంటే మార్చి 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. కాగా, సింగరేణి ఏకలవ్య స్కూల్‌లో 30 మంది చొప్పున బాలికలు, బాలుర ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రెండు సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలోని రెండు సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచగా సోమవారం అందుబాటులోకి వచ్చాయి. రానున్న వేసవి దృష్ట్యా ఇక్కట్లు ఎదురుకాకుండా దశల వారీగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచేలా అత్యాధునిక ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం అర్బన్ సబ్‌స్టేషన్‌లో రెండు 5 ఎంవీఏల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రూ.2.13 కోట్ల వ్యయంతో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ధంసలాపురం సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానాన రూ.1.60 కోట్ల వ్యయంతో 12.5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈమేరకు ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును ఎస్ఈ ఏ.సురేందర్ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈలు బాబూరావు, నంబూరి రామారావు, భద్రుపవార్, డీఈటీ యాదగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.21లక్షలు

'సీతారామ' కెనాల్ నిర్వాసితులకు పరిహారం

ఏన్కూరు: సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా లింక్ కెనాల్ నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.21 లక్షలు పరిహారం చెల్లించనున్నారు. ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లోని పలువురు రైతుల భూముల్లో కెనాల్ నిర్మాణం చేపట్టారు. అయితే, పరిహారం విషయమై తేల్చకపోవడంతో రైతులు మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తున్నారు. ఈనేపథ్యాన ఎకరాకు రూ.21లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులు వైరాలో సోమవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ కెనాల్ నిర్మాణానికి తమ భూములు ఇచ్చిన రైతులను ఎన్నటికీ మరిచిపోమని చెప్పారు.

క్లుప్తంగా

ఆర్టిజన్ల దీక్షలు ప్రారంభం



దీక్ష శిబిరంలో ఆర్టిజన్లు

ఖమ్మంవ్యవసాయం: ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో ఆర్టిజన్లుగా పనిచేస్తున్న తమను కన్వర్షన్ చేసి సర్వీసును క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఐదు రోజుల పాటు సాగే దీక్షలను సోమవారం విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు ఎస్.కే.అన్వర్, ఎం.ప్రసాద్ ప్రారంభించారు. తొలిరోజు దీక్షలో జేఏసీ జిల్లా చైర్మన్ గంటా శ్రీనివాసరావు, కన్వీనర్ కాముని ఉపేందర్‌తో పాటు అన్వర్, ఎల్వీ. కృష్ణారావు, ధరావత్ గోపి, బాదావత్ చందర్, జక్కంపూడి నరేష్, ఎం.సంధ్యారాణి, బి.నాగేశ్వరరావు, ఈ.నరేష్, ఎస్.కే.రంజాన్ వలీ, డి.రవికుమార్, నాగరాజు, అప్పిరెడ్డి, జానయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, దీక్షలకు జేఏసీ రాష్ట్ర ప్రతినిధి నరేందర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు ఎం.ప్రసాద్, బీవీఎస్.మూర్తి, ముడిక శ్రీనివాస్, బి.ఉపేందర్, వి.కిరీటాచారి మద్దతు తెలిపారు.

జాతీయ ఆర్చరీ టోర్నీకి ఐదుగురు



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారితో శంకరయ్య

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పలువురు ప్రతిభ కనబరిచారు. ఇందులో వివిధ విభాగాల్లో సత్తా చాటిన కె.రాంచరణ్, ఎం.గౌతమ్, ఈ.అవంతిక, వి.శివసాయి, సీహెచ్.అహూచ్రితను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫిబ్రవరి 10నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్రం భోల్‌పూర్‌లో జరిగే టోర్నీలో వీరు పాల్గొంటారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు.

గురుకులం నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని

వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన సిబ్బంది

నేలకొండపల్లి: గురుకులంలో ఉండడం ఇష్టం లేదో, మరేదైనా కారణమో తెలియదు కానీ ఓ విద్యార్థి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోగా సిబ్బంది వెతికి పట్టుకుని కుటుంబీకులకు అప్పగించారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో నేలకొండపల్లి గురుకులంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆమె తల్లిదండ్రులు ఆదివారం తీసుకొచ్చారు. అయితే, సాయంత్రం హాజరు నమోదు చేసే సమయాన విద్యార్థిని లేకపోవడంతో ఉపాధ్యాయులు సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించగా బయటకు వెళ్లినట్లు తేలింది. దీంతో సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి బైక్‌లపై గాలిస్తుండడంతో కోరట్లగూడెం సమీపాన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తున్న ఆమెను గుర్తించారు. దీంతో విద్యార్థిని కుటుంబసభ్యులను పిలిపించి అప్పగించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ పద్మావతిని వివరణ కోరగా ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించినందున కుటుంబ సభ్యులతో పంపించినట్లు తెలిపారు.

రూ.91లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఏపీలోని కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన పంచకర్ల వీరాంజనేయులు – దుర్గాప్రసన్న దంపతులు రూ.91.35 లక్షలకు దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశారు. తొలుత వీరాంజనేయులు లారీడ్రైవర్‌గా పనిచేయగా, ఆతర్వాత లారీలు, కార్లు కొని అమ్మే వ్యాపారం మొదలుపెట్టాడు. ఈక్రమంలో 51మంది వద్ద రుణాలు తీసుకోగా, అనంతరం తాను చెల్లించలేని పరిస్థితి ఎదురైందంటూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం ప్రాంతానికి వచ్చి ఉంటున్నాడు. ఆపై న్యాయవాదుల ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.91.35 లక్షలకు సోమవారం ఐపీ దాఖలు చేశాడు.

రైలు నుండి జారిపడడంతో గాయాలు

బోనకల్: రైలు నుండి జారి పడడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని మచిలీపట్నానికి చెందిన మణికంఠ విజయవాడ నుండి హైదరాబాద్‌కు సోమవారం రైలులో వెళ్తుండగా బోనకల్ మండలం గోవిందాపురం గేట్ వద్ద ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	5,000
మిర్చి	15,300	4,700
మిర్చి తాలు	7,000	5,000
ఏసీ మిర్చి	14,000	5,000
పత్తి	7,300	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,506

తీరనున్న రైతుల కష్టాలు

- 'భక్త రామదాసు' నీటి సరఫరాకు తొలగిన అడ్డంకులు
- సాగులోకి రానున్న మరో 5వేల ఎకరాలు
- త్వరలోనే కాల్వలకు నీరు విడుదల



భక్తరామదాసు ప్రాజెక్టు

కూసుమంచి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పాలేరు నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వలు నిర్మించగా ఈ ఫలాలు రైతులకు త్వరలో అందనున్నాయి. కాల్వల నిర్మాణం కూసుమంచి మండలంలో కోర్టు కేసులతో కొన్నిచోట్ల ముందుకు సాగలేదు. చివరకు రైతులను ఒప్పించి పరిహారం చెల్లించడంతో కాల్వల తవ్వకం 90 శాతం మేర పూర్తయింది. త్వరలోనే భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని కాల్వల్లోకి విడుదల చేయనుండగా ఆయకట్టు భూములకు అందనుంది.

అటు గోదావరి, ఇటు కృష్ణా

పాలేరు నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు పారేందుకు ఎస్సారెస్పీ-2 ద్వారా కాల్వలు తవ్వించారు. ఆతర్వాత కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలను సస్యశ్యామలం చేయడంతో పాటు ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు పాలేరు రిజర్వాయర్ ఆధారంగా భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మించారు. గతంలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వలకు అనుసంధానించిన భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు రిజర్వాయర్ నుండి ప్రస్తుతం కృష్ణా జలాలు పారుతున్నాయి. ఇంతలోనే అడ్డంకుల కారణంగా ఆగిపోయిన కాల్వల నిర్మాణం కూడా పూర్తిచేయడంతో మిగిలిన ప్రాంతాలకు సైతం నీటి విడుదలకు మార్గం ఏర్పడింది. భవిష్యత్‌లో ఎటు నుంచి అవకాశం ఆ పక్క నుంచి నీరు విడుదల చేస్తే రైతులు పంటలు పండించుకునే వీలు ఏర్పడుతుంది.

తొలగిన అడ్డంకులు...

సీఎంగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు శ్రీరాంసాగర్ 60 డీబీఎం మెయిన్ కెనాల్ తవ్వకం పూర్తి చేసినా గ్రామాలకు సాగునీటి కోసం తవ్వాల్సిన 7ఆర్ కాల్వల పనులు పలుచోట్ల నిలిచిపోయాయి. నాడు కూసుమంచి మండలంలో కొందరు రైతులు భూములకు పరిహారం పెచాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఏర్పడిన అవాంతరాలు ఇటీవలే తొలగిపోయాయి. ఈమేరకు అధికారులు పెండింగ్ కాల్వల తవ్వకాన్ని దాదాపు పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం భక్త రామదాసు ప్రాజెర్టు ద్వారా కూసుమంచి మండలంలో 21,140 ఎకరాలు సాగవుతుండగా పెండింగ్ కాల్వల పూర్తితో మరో తొమ్మిది గ్రామాల పరిధి 5,238 ఎకరాలకు అదనంగా సాగునీరు అందనుంది. ఈ యాసంగికే నీరు విడుదల చేయాలని నిర్ణయించగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల త్వరలోనే విడుదల చేసే అవకాశముంది.



సాగునీరు అందించేందుకు సిద్ధమైన కాలువ

పూర్తి ఆయకట్టుకు సాగునీరు

కూసుమంచి మండలంలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా ఇప్పుడు అందుతున్న సాగునీటిని పూర్తి ఆయకట్టుకు అందేలా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఎలాంటి అవాంతరాలు లేవు. త్వరలోనే మరో 5వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.

– రత్నకుమారి, డీఈ, నీటిపారుదల శాఖ

నీళ్లొస్తే మా ఇబ్బందులు పోతాయి...

ఇప్పటివరకు మాకు శ్రీరాంసాగర్ కాల్వల ద్వారా భక్తరామదాసు ప్రాజెక్టు నీళ్లు రాలేదు. సాగు చేసుకునేందుకు చెరువులు, కుంటలు లేవు. కాల్వల ద్వారా నీరు ఇస్తే సాగు కోసం మేం ఇన్నాళ్లుగా పడుతున్న కష్టాలన్నీ తీరనున్నాయి.

– బానోత్ రమేష్, రైతు, బోటిమీది తండా

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..

- ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా నిర్వహించేలా ఏర్పాట్లు
- 'సాక్షి'తో జెడ్పీ సీఈఓ దీక్షారైనా



జెడ్పీ సీఈఓ దీక్షా రైనా

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదల చేసినా నిర్వహించేలా తమ శాఖ తరఫున ఏర్పాట్లు చేశామని జిల్లా పరిషత్ సీఈఓ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) దీక్షా రైనా వెల్లడించారు. అన్నిరకాల సామగ్రి సమకూర్చుకున్నామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధత వివరాలను ఆమె 'సాక్షి'కి వెల్లడించారు. ఆ వివరాలు సీఈఓ మాటల్లోనే...

ఆగస్టులో ముగిసిన పదవీకాలం

గత ప్రభుత్వంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ సాధారణ ఎన్నికలు ఆగస్టు 2019లో జరిగాయి. ఆగస్టు 2024తో వారి పదవీకాలం పూర్తయింది. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గాల గడువు గత ఏడాది ఆగస్టు 6, 7వ తేదీల్లో ముగిసింది. ఆ తర్వాత ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అన్ని మండలాలకు కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ ఆఫీసర్లను నియమించి పర్యవేక్షిస్తున్నాం.

1,612 కేంద్రాలు

జిల్లాలో 20 మండలాలకు గాను 289 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అలాగే, 20 జెడ్పీటీసీ స్థానాలు కొనసాగుతున్నాయి. అంతేకాక 20మంది కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు 11వేల మంది ఉద్యోగులు అవసరమని భావిస్తున్నాం. ప్రస్తుతానికి 1,612 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల నాటికి ఇవి పెరిగే అవకాశముంది.

అవసరమైన సామగ్రి చేరింది..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి సమకూర్చుకుంటూ ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యాం. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పత్రాలు ముద్రించేందుకు కావాల్సిన పేపర్ బండిళ్లు హైదరాబాద్ నుండి చేరాయి. వీటిని జెడ్పీ గోదాంలో భద్రపరిచాం. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఖరారయ్యాక బ్యాలెట్ పత్రాలు ముద్రిస్తాం. గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిశాక ఎంపీపీ, జెడ్పీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నాం.

'హెల్పింగ్ హ్యాండ్స్' సేవలు అభినందనీయం



చెక్కు అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన తడికమళ్ల నాగేశ్వరరావు – స్వాతి దంపతుల కుమారులు మనీష్, మనోజ్ పుట్టుకతోనే శారీరక వైకల్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని అమెరికాలో ఉంటున్న మద్దినేని రవికి ఆయన తల్లిదండ్రులు మద్దినేని ప్రసాదరావు – కమల తెలపడంతో స్నేహితులతో కలిసి సేకరించిన రూ.2లక్షలను హెల్పింగ్ హ్యాండ్ సంస్థ పంపించారు. ఈమేరకు చెక్కును నాగేశ్వరరావు కుటుంబానికి సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజ అందజేశారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సిరిపురపు రమణరావు, నాగేంద్రబాబు పాల్గొన్నారు

ఎంబీబీఎస్ విద్యార్థికి రూ.1.04 లక్షలు...

కల్లూరు: కల్లూరు శాంతినగర్‌కు చెందిన తెల్ల పుట్ట ఉదయ్‌కిరణ్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, నిరుపేద కుటుంబం కావడంతో ఫీజు కట్టేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన దాతల చేయూతతో రూ.1.04లక్షలు సేకరించారు. ఈమేరకు చెక్కును సోమవారం విద్యార్థి తల్లిదండ్రులు రాంబాబు, ధనలక్ష్మికి ఫౌండేషన్ ప్రతినిధి సీతారత్న కుమారి చేతుల మీదుగా అందచేశారు.

బాధ్యతలు చేపట్టిన ఖమ్మం మార్కెట్ కమిటీ



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ హన్మంతరావు, పక్కన వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. మార్కెట్‌లో సోమవారం పూజలు చేశాక చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్‌తో పాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి వద్దిరాజు సుజన్‌కుమార్ పాల్గొనగా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు కమర్తపు మురళి, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, జీ.వై.నరేష్, మన్నెం కృష్ణ, కల్వకుంట్ల గోపాల్, తూములూరి లక్ష్మీనరసింహారావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, నున్నా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని గురుకులానికి తాళం



గురుకుల పాఠశాలకు వేసిన తాళం

ఖమ్మంఅర్బన్: నెలల తరబడి అద్దె చెల్లించక, విద్యుత్ బిల్లు కూడా బకాయి ఉండడంతో గురుకుల పాఠశాల భవనానికి యాజమాన్యం తాళం వేసింది. దీంతో సెలవులకు వెళ్లొచ్చిన విద్యార్థులు బయటే ఉండగా అధికారుల వినతితో తాళం తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం పుట్టకోట రోడ్డులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ భవనంలో తిరుమలాయపాలెం మండలానికి చెందిన ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల కొన్నేళ్లుగా కొనసాగుతుంది. ఇందులో 570మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఎనిమిది నెలల అద్దె, విద్యుత్ బకాయిలు కలిపి మొత్తంగా రూ.35లక్షల పైగానే యజమాన్యానికి చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. దీంతో ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చినా స్పందన లేక భవనానికి తాళం వేసినట్లు సమాచారం. ఈమేరకు సంక్రాంతి సెలవులకు వెళ్లిన విద్యార్థులు సోమవారం 175 మంది వరకు రావడంతో తాళం వేసి ఉండగా ఇబ్బంది పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గురుకులాల జోనల్ అధికారి స్వరూపారాణి, ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఒకటి, రెండు రోజుల్లో విద్యుత్ బిల్లు బకాయి, త్వరలోనే అద్దె కూడా చెల్లిస్తామని చెప్పడంతో భవన యజమానులు తాళం తీశారు. కాగా, ఎక్కడా విద్యార్థులకు ఇబ్బంది ఎదురుకాలేదని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ స్థలంలో కాలుతున్న వ్యర్థాలు



ఖమ్మం కొత్త బస్టాండ్‌ను సోమవారం పొగ కమ్మేసింది. బస్టాండ్ పక్కన ఉన్న ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలంలో వ్యర్థాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో పొగ బస్టాండ్ ఆవరణను కమ్మేసింది. సాయంత్రం 6గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పొగ వస్తూనే ఉండడంతో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఊపిరాడక అవస్థ పడ్డారు. మంటలను ఆర్పేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ప్రయత్నించినా ఫలితం కానరాలేదు.

– ఖమ్మంమయూరిసెంటర్

తిరునాళ్లకు వేలం పాటలు

మధిర: మహాశివరాత్రి సందర్భంగా మధిరలోని వైరా నది ఒడ్డున ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత మృత్యుంజయ స్వామి ఆలయంలో తిరునాళ్లు జరగనున్నాయి. ఈ సందర్భంగా దుకాణాల ఏర్పాటు, లడ్డూ ప్రసాదం, కొబ్బరికాయల అమ్మకం, కొబ్బరిచిప్పల సేకరణ, జాయింట్ వీల్ ఏర్పాటుకు సోమవారం దేవాదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. ఈమేరకు కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలికి చెందిన కటారి అప్పారావు రూ.71 వేలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.66 వేల ఆదాయం రాగా, ఈసారి రూ.5వేలు పెరిగింది. కాగా, లడ్డూ ప్రసాదం, జాయింట్ వీల్ ఏర్పాటు తదితర అంశాల్లో ఎక్కువ మంది టెండర్లకు రాకపోవడంతో వాయిదా వేశామని ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు. కాగా, జాతర సందర్భంగా జాయింట్ వీల్, ఇతర వినోద ప్రదర్శనలు ఇచ్చే వారు ధరలు పెంచకుండా అధికారులు పర్యవేక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పడకంటి మురళి కోరారు. ఈసందర్భంగా నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, రాధాకృష్ణ, మధు తదితరులతో కలిసి ఆయన ఈఓకు వినతిపత్రం అందజేశారు.

పోస్టాఫీసుల్లో 1.30లక్షల ఖాతాలు

చింతకాని: తపాలా శాఖ ద్వారా ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. చింతకాని మండలం నాగులవంచ ఉప తపాలా కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖమ్మం డివిజన్ పరిధిలోని ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,30,237 మందితో ఖాతాలు తెరిపించగా, పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలను 41,400 మంది తెరిచారని చెప్పారు. 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ తపాలా బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యం కోసం ఆధార్ సేవలు అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్‌తో పాటు సీహెచ్.కోటేశ్వరరావు, రాంప్రసాద్, తోటకూరి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

మధిర: మధిరలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. స్థానిక వైరా రోడ్డులోని దేవినేని శ్రీనుకు చెందిన సైకిల్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు మొదలై పక్కనే ఉన్న షేక్ సుభాని చెందిన గాలి మిషన్, అక్బర్‌కు చెందిన బిర్యానీ పాయింట్‌కు వ్యాపించారు. దీంతో మూడు దుకాణాల్లోని రూ.4లక్షల విలువైన సామగ్రి కాలి బూడిదైంది. ఈమేరకు కాంగ్రెస్ నాయకుడు కోరంపల్లి చంటి ఇచ్చినసమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే, ఒకే ఫైర్ ఇంజన్ ఉండగా మంటలు ఎగిసిపడుతుండడంతో సీఐ మధు వైరా నుండి మరో ఫైర్ ఇంజన్‌ను పిలిపించడంతో మంటలు అదుపు చేయగా స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరాతండాకు చెందిన బానోతు పాప (55) పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా ఆయన మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. దీంతో ఈనెల 18న పురుగుల మందు తాగిన ఆయన ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పాప కుటుంబీకుల ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్ : పోలీసులు సోమవారం ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం రెవెన్యూ కాలనీకి చెందిన ధరణిశివకు బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వల్లోజి గణేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నంగా రూ.4 లక్షల నగదు ఇచ్చారు. వీరికి పాప ఉంది. ధరణిని కొంతకాలంగా ఆమె భర్త గణేష్, మామ శ్రీను, అత్త లక్ష్మి అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. వేధింపులు భరించలేక ఏడాది క్రితం నుంచి ఆమె పుట్టింట్లో ఉంటోంది. కొన్ని రోజుల తర్వాత అక్కడకు వచ్చిన భర్త మళ్లీ వేధిస్తున్నాడు. పాపను చంపేస్తానని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

హామీలు అమలుచేయండి

- రిటైర్‌మెంట్ వయస్సు పెంపు సరికాదు
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 2023 జూలై నుంచి వర్తించేలా పీఆర్సీ వర్తింపచేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి, జలగంనగర్, గొల్లగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను సోమవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగులు రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలనే ఆలోచన ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపదని తెలిపారు. ఈ ప్రతిపాదనను విరమించుకుని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలుచేయడమే కాక పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ రంజాన్, ఎం.నర్సయ్య, నవీన్‌కుమార్, మహేష్, వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ హెచ్‌ఎంపై దాడికి నిరసన

తిరుమలాయపాలెం: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై జరిగిన దాడిని నిరసిస్తూ విద్యా పరిరక్షణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకాగా, తిరుమలాయపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులపై దాడి చేయడం అమానుషమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్, టీపీటీఎఫ్ బాధ్యులు ఏ.వీ.నాగేశ్వరరావు, నరసయ్య, కేశ్యా, వీరబాబు, ధనమూర్తి, లక్ష్మి, హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. తిరుమలాయిపాలెం మండలం కాకరవాయికి చెందిన వీరబోయిన మధు 2023 ఫిబ్రవరి 9న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చెల్లని చెక్కు కేసులో...

అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి సోమవారం చెప్పారు తల్లాడ మండలం రామానుజవరానికి చెందిన వ్యక్తి వద్ద ఖమ్మం రేవతి సెంటర్‌కు చెందిన వడ్డెటి నరసింహారావు 2015 అక్టోబర్‌లో రూ.10లక్షల అప్పు తీసుకున్నారు. ఈ నగదు తిరిగి చెల్లించే క్రమాన ఆయన 2016 అక్టోబర్‌లో ఇచ్చిన చెక్కు బ్యాంక్‌లో జమ చేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో ఫిర్యాది తన న్యాయవాది జి.రామారావు ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా విచారణ అనంతరం నరసింహారావుకు ఆరు నెలలు జైలుశిక్షతోపాటు ఫిర్యాదికి రూ.10లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు.

విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి..

ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి మూడు నెలలు జైలుశిక్షతోపాటు రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు వెలువరించారు. చింతకాని మండలం తిమ్మినేనిపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ నబీ అలియాస్ అబ్దుల్లా, ఆళ్ల శ్రీనివాసరావు అలియాస్ శ్రీను, తాళ్లూరి రాంబాబు గంధసిరిలో మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో వీఆర్‌ఏ బుయ్యా ఉపేందర్, వీఆర్వో 2016 డిసెంబర్ 23న అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈక్రమాన ఉద్యోగులను బెదిరించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.